క్లుప్తంగా

తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన



ప్రత్తిపాడు: ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రత్తిపాడు సెక్టార్‌లోని కుమ్మరిపాలెం, గొట్టిపాడు సెక్టారులోని తిక్కిరెడ్డిపాలెం గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. శిశువుకు తల్లిపాలు అందించడం వలన కలిగే ప్రయోజనాలను గర్భిణులు, బాలింతలకు వివరించారు. తల్లిపాలు ఇవ్వడం వలన బిడ్డకు సరైన పోషకాహారం లభిస్తుందని, తల్లిపాలు బిడ్డకు మొదటి టీకా అని తెలిపారు. 'తల్లిపాలు ముద్దు డబ్బా పాలు వద్దు' అనే నినాదంతో తల్లిపాలపై అవగాహన కల్పించారు. ఆయా కార్యక్రమాల్లో ఎస్ఎం కనకవల్లి, లావణ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు నగరాజకుమారి, వెంకాయమ్మ, సుభాషిణి, తదితరులు పాల్గొన్నారు.

జన సురక్షా శిబిరానికి విశేష స్పందన



పొన్నూరు: మండల పరిధి బ్రాహ్మణకోడూరులోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన జన సురక్షా శిబిరంకు విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జీఎం ఆర్.కే. మహానా ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవల ప్రాధాన్యతను వివరించారు. యూనియన్ బ్యాంక్ అందిస్తున్న ప్రజాసేవలను ప్రశంసించారు. ఎల్‌డీఓ రాజేష్ భూమిలేని కౌలు రైతులకు అందుబాటులో ఉన్న రుణ పథకాలపై, ఇతర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలపై అవగాహన కల్పించారు. నామినేషన్ నవీకరణలు, ఇతర ప్రభుత్వ సామాజిక భద్రత పథకాలను తెలియచేశారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం మహిపాల్ రెడ్డి, యూనియన్ బ్యాంక్ రీజినల్ మేనేజర్ ఎస్. జవహర్, ఇతర ఉన్నతాధికారులు, సిఎఫ్ఎల్ కౌన్సిలర్లు, స్వయం సహాయ బృందాల సభ్యులు, బ్యాంకు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ఉప్పరపాలెంలో పొలం పిలుస్తోంది



పొన్నూరు: మండలంలోని ఉప్పరపాలెం, సీతారామపురం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ విస్తరణ అధికారి ఐ. శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రస్తుతం రైతులు వెదవరి సాగుచేసిన పొలంలో 20 నుంచి 25 రోజుల పైరుకు కలుపు నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. కౌలు రైతులు తప్పనిసరిగా సీసీఆర్సీ కార్డులను వీఆర్ఓ నుంచి పొందాలని తెలిపారు. ప్రతి రైతు సేవా కేంద్రంలో యూరియా అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీతారామపురం సర్పంచి చుండి పద్మావతి, వెంకట నరసయ్య, వ్యవసాయ విస్తరణ అధికారి డి. యామిని, సహాయకులు బి. ప్రీతి, బి. తేజస్విని, సింహాద్రి, సురేష్ బాబు, రైతులు పాల్గొన్నారు.

రాయితీపై రైతులకు మినుములు

ఏవో షేక్ సుగుణ బేగం



ప్రత్తిపాడు: రైతులకు వంద శాతం రాయితీపై మినప విత్తనాలు ఇవ్వడం జరుగుతుందని మండల వ్యవసాయాధికారి షేక్ సుగుణ భేగం అన్నారు. మండల పరిధిలోని పాత మల్లాయపాలెంలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు సాగు చేసిన పత్తి, మినుము పంట పొలాలను పరిశీలించారు. పంటలో చేపట్టవలసిన సస్యరక్షణ చర్యలను వివరించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ఎన్ఎఫ్ఎస్ఎం స్కీం ద్వారా రైతాంగానికి వంద శాతం రాయితీపై పూర్తి ఉచితంగా అందిస్తున్న మినుములను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కౌలు రైతులు తప్పనిసరిగా సీసీఆర్సీ కార్డులు తీసుకోవాలన్నారు. పంట సాగు చేసిన రైతులు అలసత్వం వహించకుండా పంట నమోదు చేయించుకోవాలని చెప్పారు. వెంట వీహెచ్ ఎ.గణేష్, రైతులు పాల్గొన్నారు.

బాబుది నయవంచన పాలన

- హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం
- వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ
- బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీకి గ్రామాల్లో విశేష స్పందన
- చంద్రబాబు మోసాలను తెలిపేందుకు తరలివస్తున్న మహిళలు



మోసపూరిత కూటమి మేనిఫెస్టోను ఆవిష్కరించిన అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: ఎన్నికలకు ముందు సూపర్‌సిక్స్‌తో పాటు అనేక హామీలిచ్చి అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పొన్నూరు వైఎస్సార్ సీపీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ విమర్శించారు. ప్రజలను మోసం చేయడంలో చంద్రబాబు దిట్ట అన్నారు. మంగళవారం మండలంలోని పెదపాలెం, చింతలపూడి, పెద ఇటికంపాడు, ఉప్పరపాలెం గ్రామాల్లో బాబు ష్యూరిటీ, మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించి ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మోసాలను వివరించారు. మహానేత డాక్టర్. వైఎస్. రాజశేఖరరెడ్డి విగ్రహాలకు నివాళులర్పించారు. ఎన్నికల హామీల మోసపూరిత మేనిఫెస్టోను ఆవిష్కరించి ప్రతి ఒక్కరికీ అందజేశారు. ప్రజలు తమకు జరిగిన అన్యాయాలను తెలిపి ఆవేదన వ్యక్తం చేశారు. అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలు త్వరలో త్వరలోనే అంటూ కూటమి పాలకులు ఐదేళ్లు పూర్తి చేస్తారని మండిపడ్డారు. ఎన్నికల్లో గెలుపు కోసం అనేక బూటకపు హామీలిచ్చిన చంద్రబాబు అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చారన్నారు. ఏడాది దాటినా ఏ ఒక్క హామీని అమలు చేయలేకపోయారని విమర్శించారు. వైఎస్సార్ సీపీ పార్టీ నాయకులు, కార్యకర్తలపై అనేక అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని, అయినా భయపడే వారెవరూ లేరని అన్నారు.

హామీల అమలు వైఎస్ జగన్‌కే సాధ్యం

ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో వెనుకడుగు వేయని ఏకైక నాయకుడు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. ఎండీయూ వాహనాల రద్దుతో ఇంటింటికీ రేషన్ కట్ చేయడంతో ఒక్క సంవత్సరంలోనే ప్రజల ఆనందం అటకెక్కిందన్నారు. ఎమ్మెల్యే నరేంద్ర పాలనలో పొన్నూరులో అభివృద్ధి శూన్యం అన్నారు. చింతలపూడి గ్రామంలో మౌలిక వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఖజానా నింపుకోవడమే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ నల్లమోతు రూత్ రాణి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆకుల వెంకటేశ్వరరావు, ఇంటిలెక్చువల్ ఫోరం అధ్యక్షులు ఎస్. రవీంద్రబాబు, పెన్షనర్స్ ఎంప్లాయిస్ అధ్యక్షులు చిర్ర అక్కిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు చింతలపూడి మురళీకృష్ణ, మైనార్టీ, ఎస్సీ, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు షేక్. మౌలాలి, పొనుగుపాటి పాల్ రాజు, ప్రవీణ్, మహిళా విభాగం అధ్యక్షురాలు కె. మరియా రాణి, నాయకులు షేక్. నాజర్, అంబటి వెంకటేశ్వరరావు, రుద్రపాటి ఆదిశేషు, దేవరకొండ గోపి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి ఉజ్వల భవిష్యత్తే లక్ష్యం

ఆర్‌వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాల రథసారథులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న కళాశాల యాజమాన్యం, అతిదులు, విద్యార్థులు

గుంటూరు రూరల్: తమ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న ప్రతి విద్యార్థికి ఉజ్వల భవిష్యత్తును అందించడమే తమ ధ్యేయమని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేనిలు తెలిపారు. మంగళవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో 2025–26 విద్యా సంవత్సర నూతన బ్యాచ్, బీటెక్ ఇంజనీరింగ్ కోర్సుల ప్రవేశాలను ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం మాట్లాడుతూ ఈ ఏఐసీటీఈ ఇండక్షన్ ప్రోగ్రాం ద్వారా విద్యార్థులకు నేటి తొలి అడుగు రేపటి ఆవిష్కర్తలుగా ఎదిగే లక్ష్యంతో విద్యాబోధన చేస్తుందని, విద్యార్థులు సాంకేతిక, వ్యక్తిత్వ నైపుణ్యాన్ని మెరుగు పరుచుకోవాలన్నారు. నిపుణులచే, ఇంజనీరింగ్ ఎడ్యుకేషన్, ఉద్యోగ అవకాశాలు, అంకుర పరిశ్రమల స్థాపన, నూతన ఆవిష్కరణలు, మేధా శక్తి మెరుగుదల, నైతిక అంశాలు, సామాజిక సేవా, మానవ సంబంధాలు వాటి విలువలు, ఆరోగ్య సంరక్షణ వివిధ అంశాల మీద అవగాహన కార్యక్రమాలతో పాటూగా గీతాలాపన, సాంస్కృతిక నృత్యం, రంగోలి, ఫేస్ పెయింటింగ్, చిత్రలేఖనం, ఫోటోగ్రఫీ వంటి వివిధ వినోద కార్యక్రమాలను నిర్వహించారు. ఉన్నత విద్యా ప్రమాణాలతో కూడిన బోధనతో పాటూగా, నిపుణుల పర్యవేక్షణలో విద్యార్థులను పరిశోధనల వైపు ప్రోత్సహించడం ద్వారానే తమ కళాశాల ఉత్తమ ఫలితాలను సాధిస్తూ, తమ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికలలో 85 శాతం మంది విద్యార్థులకు భారీ ప్యాకేజీలతో కూడిన ఉద్యోగాలు లభించడంతో పాటూ, ఉన్నత చదువులకు విదేశాలలోని ఉత్తమ యూనివర్సిటీలలో ప్రవేశాలు లభించడం గర్వకారణమని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్ గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్‌లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థుల కోసం తమ కళాశాల అందిస్తున్న మెరుగైన సౌకర్యాలను వినియోగించుకొని, భవిష్యత్ తరాలకు మార్గదర్శకులుగా నిలవాలని పేర్కొన్నారు. కౌన్సెలింగ్‌లో ఆర్‌విఆర్‌జెసి ఇంజనీరింగ్ కళాశాలను ఎంపిక చేసుకున్న సందర్భంగా కళాశాల సిబ్బంది నూతనంగా ప్రవేశించిన విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, వివిధ శాఖల విభాగాధిపతులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు వెంటనే తొలగించాలి



నిరసన తెలియజేస్తున్న దండా లక్ష్మీ నారాయణ

ప్రత్తిపాడు: విద్యుత్ పాతమీటర్ల స్థానంలో ప్రభుత్వం అదానీ స్మార్ట్ మీటర్లను బిగిస్తుందని, తక్షణమే ఆ ప్రక్రియను నిలిపివేయాలని కోరుతూ సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ప్రత్తిపాడు పంచాయతీ అధికారులకు వినతిపత్రం అందించారు. స్థానిక కార్యాలయంలో సెక్రటరీని కలిసి ఇప్పటివరకు బిగించిన స్మార్ట్ మీటర్లను వెంటనే తొలగించాలన్నారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రస్తుత విద్యాశాఖమంత్రి నారా లోకేష్ అదానీ స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలగొట్టాలని పిలుపునిచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. అదేవిధంగా అదానీతో చేసుకున్న అన్ని రకాల ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నాడు కరెంటు బిల్లులను పెంచబోమని హామీ ఇచ్చి, ఎన్నికలయ్యాక నెలనెలా పెరుగుతున్న విద్యుత్ బిల్లులు ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయన్నారు. ట్రూఅప్ చార్జీలు, ఇంధనపు సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

చేబ్రోలులో...

చేబ్రోలు: టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి ప్రజలపై భారాలు మోపుతున్నదని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీ నారాయణ అన్నారు. ప్రజలపై విద్యుత్ చార్జీల భారాలు తగ్గించాలని, ఇళ్లకు స్మార్ట్ మీటర్లను బిగించవద్దని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం చేబ్రోలులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. స్థానిక ముట్లూరు రోడ్డులోని సెంటర్‌లో ప్లేకార్డ్స్ పట్టుకొని నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ ఏడాది కాలంలో విద్యుత్ చార్జీల పేరుతో 21 వేల కోట్ల రూపాయలు భారాలు మోపిన ప్రభుత్వం ఆగస్టు నెల నుంచి 18 వేల కోట్ల రూపాయల అదనపు భారాన్ని వేయటానికి సిద్ధపడుతున్నదని విమర్శించారు. ఎన్నికల ముందు స్మార్ట్ మీటర్లు పగలకొట్టాలని పిలుపునిచ్చిన టీడీపీ నాయకులు ఇప్పుడు స్మార్ట్ మీటర్లే స్మార్ట్‌గా ఉన్నాయని ప్రచారం చేయటం వెనుక మతలబు ఏమిటీ అని ప్రశ్నించారు. స్మార్ట్ మీటర్లు ఉచితమని చెప్పి 9నుంచి 18 వేల రూపాయల వరకు వసూలు చేస్తున్నారని అన్నారు. ప్రజల జేబులు కొల్లగొట్టడమే టీడీపీ ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తున్నదన్నారు. అదానీ కంపెనీ ఒప్పందం వల్ల లక్ష కోట్ల రూపాయిల భారం ప్రజలపై పడనుందని తెలిపారు. కార్యక్రమంలో విద్యాసాగర్, నాని, నాగరాజు, బి.భూషణం, రాంబాబు పాల్గొన్నారు.

పెదకాకానిలో...

పెదకాకాని: ఆదాని స్మార్ట్ మీటర్ల పై ఆశా వర్కర్లకు మంగళవారం సీఐటీయూ జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ కరపత్రాలు పంచి అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు ప్రజలను దోచుకోవడానికి ప్రభుత్వాలు వేస్తున్న ఎత్తుగడ అన్నారు. ఇప్పటికే కార్పొరేట్ కంపెనీలు మొదట సెల్‌ఫోన్లు, డేటాను తక్కువ ధరకు అందించి వాటిని నిత్యజీవితంలో భాగంగా చేసి నేడు ఇష్టరాజ్యంగా చార్జీలు పెంచుతున్నారన్నారు. స్మార్ట్ మీటర్లు కూడా ఇదే కోవలోకి వస్తాయని మొదట సులభ ప్రక్రియ అని చెబుతూ తరువాత అలవాటు చేసి మోయలేని భారాలను వేస్తారన్నారు. ఆశ వర్కర్లు స్మార్ట్ మీటర్లపై అవగాహన తెచ్చుకుని ప్రతి ఒక్కరికీ ఈ విషయం చేరవేయాలి అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని పలువురు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వ్యాపారులు చెప్పిందే రేటు!!

యూరియా ధరలకు రెక్కలు

- రైతుల నుంచి అధికంగా వంద నుంచి నూట యాభై వసూలు
- జిల్లా కలెక్టర్ ఆదేశించినా స్పందించని వ్యవసాయశాఖాధికారులు



ఎరువుల షాపుల్లోని ఎరువుల బస్తాలు



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న రైతు చందు సత్యనారాయణ (ఫైల్)

చేబ్రోలు: ఎరువుల అందుబాటులో లేకపోవటంతో అధిక ధరలు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మిని వేడుకోవటంతో ఆమె వెంటనే స్పందించి స్థానిక, జిల్లా వ్యవసాయ శాఖాధికారులను ఆదేశించి 13 రోజులు అయినప్పటికీ స్పందన కరువైంది. మండలంలో ఎరువుల కొరత కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైతుల అవస్థలను కొంతమంది తమకు అనుకూలంగా మలుచుకొని జేబులు నింపుకుంటున్నారు. రైతు సేవాకేంద్రాలు, సహకార సంఘాలు, సొసైటీలకు ఎరువులను సరఫరా చేయటంలో ప్రజాప్రతినిధులు, అధికారులు విఫలమవుతున్నారు.

అధికారుల పర్యవేక్షణా లోపం రైతులకు శాపంగా మారింది. చేబ్రోలు మండలంలో రైతులకు అవసరమైన యూరియా, డీఏపీ ఎరువులను అధిక ధరలకు అన్నదాతలు ఎరువుల షాపుల్లో అధిక ధరలకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొద్ది రోజులుగా మండల కేంద్రమైన చేబ్రోలులోని ఎరువుల షాపుల్లో డీఏపీని బ్లాక్ మార్కెట్లులో విక్రయిస్తున్నారు. ప్రభుత్వం 50కిలోల డీఏపీ బస్తాను రూ.1350లకు ఎమ్మార్పీ ధరకు ప్రకటించగా ఎరువుల షాపుల్లో మాత్రం రూ.1450 నుంచి రూ.1500ల వరకు విక్రయిస్తున్నారు. దీంతో ప్రభుత్వం ప్రకటించిన ధర కంటే రూ.100 నుంచి రూ.150లు అధికంగా రైతులు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. యూరియా బస్తా రూ.267లు ఎమ్మార్పీ ధర ఉండగా ఎరువుల షాపుల్లో మాత్రం రూ.350 నుంచి రూ.400లకు విక్రయిస్తున్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులు యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులను పిచికారీ చేయాల్సిన దశలో ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు స్పందించకపోవటంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గతంలో ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా గ్రామాల్లోనే రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులో ప్రభుత్వ ప్రకటించిన ధరకు ఎమ్మార్పీ రేట్లకు అందజేశారు. ప్రస్తుతం గ్రామస్థాయిలో రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో లేకపోవటంతో అన్నదాతలు ఎరువుల షాపుల్లో వ్యాపారస్తులు చెప్పిన రేట్లకు కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు అధికారులకు తెలిసినప్పటికీ స్పందించకపోవటంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇకనైన సంబంధిత అధికారులు స్పందించి రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచి ఎమ్మార్పీ ధరలకు ఎరువులను రైతు సేవా కేంద్రాలు, సొసైటీలు, సహకార సంఘాల ద్వారా రైతులకు సరఫరా చేసే విధంగా దృష్టి పెట్టాలని రైతాంగం కోరుతున్నారు.

13 రోజులైనా ఆదేశాలు బేఖాతరు

చేబ్రోలు మండలం మంచాల గ్రామాన్ని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి జులై 24వ తేదీన పర్యటించారు. స్థానికులు ఎరువుల కొరత, అధిక ధరలపై రైతులు ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ చేబ్రోలు ఏవో ప్రియదర్శినికి పలు సూచనలు చేశారు. ఎరువులు పుష్కలంగా ఉన్నాయని అయినప్పటికి సమస్య ఎందుకు వస్తుందని ప్రశ్నించారు. డీఏవోకు ఫోన్‌లో మంచాల గ్రామానికి ఎరువులను సరఫరా చేయాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశించి 13 రోజులు అయినప్పటికి వ్యవసాయశాఖాధికారులు యూరియా కొరత, అధిక ధరలపై నామమాత్రపు చర్యలు కూడా తీసుకోకపోవటంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వీటి ధరలపై ఉన్నతాధికారులు దృష్టిసారించాలని పలువురు రైతు సోదరులు కోరుతున్నారు.

12న చలపతిలో ప్రాంగణ ఎంపికలు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ రామారావు

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని లాం నందున్న చలపతి ఇనిస్టిట్యూట్‌అఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాలలో గుంటూరులో నైపుణ్యవంతులైన యువతకు, ఉద్యోగాన్ని కోరుకునే అభ్యర్థుల కోసం ఈనెల 12వ తేదీన ప్రాంగణ ఎంపికలు నిర్వహించబోతున్నామనికళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రాంగణ ఎంపికల బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రాంగణ ఎంపికలో ప్రముఖ హెల్త్ కేర్ కంపెనీ బీఎస్‌వీ కేర్ సంస్థ పాల్గొంటుందన్నారు. ఈ సంస్థ దేశవ్యాప్తంగా మంచి పేరున్న కంపెనీ కావడంతో విద్యార్థులకు, యువతకు నైతికమైన ఉద్యోగఅవకాశాలు లభించబోతున్నాయన్నారు. ఈ ప్రాంగణ ఎంపికకు ఫార్మా డి, ఎంఫార్మసీ (ఫార్మకాలజీ) కనీస విద్యార్హత కలిగి ఉండాలన్నారు. ఈ అర్హతలతో కూడిన అభ్యర్థులు తమ బయోడాటా విద్యాసంబంధిత సర్టిఫికెట్లతో హాజరుకావాల్సి ఉంటుందన్నారు. ఎంపికప్రక్రియలో రెండు లెవెల్స్‌లో రాత పరీక్షలు, స్క్రీనింగ్, ఇంటర్వ్యూ రౌండ్స్ జరుగుతాయని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు కళాశాల ప్రాంగణంలో రెండు నెలల పాటు శిక్షణ పొంది ఆ తరువాత ఉద్యోగ నిర్వహణ ఇంటి వద్ద నుండి నిర్వహిస్తారన్నారు. జూనియర్ లెవెల్ కేటగిరీలో నెలకు రూ.25000 చొప్పున జీతం ఇవ్వనున్నట్టు తెలిపారు. ఇది విద్యార్థులకు, కాలేజీ పూర్తిచేసిన అభ్యర్థులకు, అలాగే ఉద్యోగమార్పును ఆశించే వారికి ఒక మంచి అవకాశంగా నిలవనుందన్నారు. కావున అర్హత కలిగిన విద్యార్థులందరూ ఈ సదవకాశాన్ని వినియోగించుకోగలరని తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ వ్యవసాయ పరపతి సంఘంగా పెదకాకాని



మంత్రి అచ్చంనాయుడు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న మొవ్వా వెంకటేశ్వరరావు

పెదకాకాని: గుంటూరు జిల్లా ఉత్తమ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంగా పెదకాకాని ఎంపికైనట్లు రాష్ట్ర పీఏసీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, పెదకాకాని పీఏసీఎస్ సెక్రటరీ మొవ్వా వెంకటేశ్వరరావు తెలిపారు. పెదకాకాని పీఏసీఎస్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ 2023–24 సంవత్సరానికి గాను గుంటూరు జిల్లా నుంచి మూడు పీఏసీఎస్‌లను ఉత్తమ సేవా పురస్కారానికి ఎంపిక చేయడం జరిగిందన్నారు. వాటిలో పెదకాకాని మండలంలోని పెదకాకాని పీఏసీఎస్ ఒకటన్నారు. అలానే 2024–25 సంవత్సరానికి గాను ఎంపిక చేసిన మూడు ఉత్తమ పీఏసీఎస్‌లలో పెదకాకాని మండలంలోని తక్కెళ్ళపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఉందన్నారు. పీఏసీఎస్ ద్వారా రైతులకు రుణాలు మంజూరు, రుణాలు వసూళ్ళు, ఎరువుల వ్యాపారం ఆధారంగా ఉత్తమ పీఏసీఎస్‌లను ప్రభుత్వం ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. సోమవారం రాత్రి రాష్ట్ర పీఏసీఎస్ 62వ అవతరణ దినోత్సవం విజయవాడలో జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చంనాయుడు చేతుల మీదుగా రాష్ట్ర పీఏసీఎస్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మొవ్వా వెంకటేశ్వరరావు పెదకాకాని ఉత్తమ పీఏసీఎస్ అవార్డు అందుకున్నారు.

అమ్మవార్లకు 108 కిలోల పసుపుతో పూజ



నగరంపాలెం: స్థానిక అరండల్‌పేట 4/4వ అడ్డరోడ్డులోని అష్టలక్ష్మీ సమేత లక్ష్మీనారాయణ స్వామి 30వ కోటి కుంకుమార్చన ఉత్సవాలు మంగళవారం కొనసాగాయి. శ్రీచక్ర మహామేరుకు విశేషాభిషేకార్చనలు, శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక అభిషేకార్చనలు, మండపారాధనలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవార్లకు 108 కిలోల పసుపు పూజ వేదమంత్రాలతో విశేష హారతులు, నక్షత్ర హారతి, కోటి కుంకుమార్చనలో సువాసినులు హాజరయ్యారు. భక్తులకు తీర్థ, అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ ప్రధానార్చకులు మర్రిపాటి ప్రసాద్‌శర్మ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

శ్రీకనకమహాలక్ష్మీ అమ్మవారికి విశేష కుంకుమార్చనలు

స్థానిక సిద్ధార్థనగర్ 11వ వీధిలోని కనకమహాలక్ష్మీ మందిరంలో రెండో శ్రావణ మంగళవారం సువాసినులతో విశేష కుంకుమార్చనలు, పండితుల వేద మంత్రాల నడుమ అమ్మవారికి ప్రత్యేకాలంకరణ చేశారు. ప్రత్యేక హారతి, మంత్రపుష్పం అనంతరం భక్తులు, మహిళలకు తీర్థ ప్రసాదాలను అందించారు. వ్యవస్థాపకులు ఘంటసాల విజయస్వామి కార్యక్రమాలు పర్యవేక్షించారు.

తల్లిపాలు బిడ్డల జీవితానికి ఆరోగ్య పోషకాలు



తల్లిపాల వారోత్సవాల ర్యాలీలో పాల్గొన్న అంగన్‌వాడీ క్యాకర్తలు, బాలింతలు

గుంటూరు రూరల్: ప్రతి చిన్నారికి తల్లిపాలను తప్పకుండా పట్టించాలని తల్లిపాలు చిన్నారుల జీవితాలకు ఆరోగ్యపోషకాలని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ బి జ్యోతి తెలిపారు. మంగళవారం వెస్ట్ 1 సెక్టార్ పరిధిలో పొత్తూరు గ్రామంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి తల్లులకు, గర్భిణులకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. అప్పుడే పుట్టిన ప్రతి చిన్నారికి గంటలోగా తల్లిపాలను పట్టించాలని తెలిపారు. మూడనమ్మకాలను విడనాడాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎమ్ ప్రియాంక, మహిళా పోలీస్ శాంతి, సెక్టార్ పరిధిలోని 31 మంది అంగన్‌వాడీ టీచర్స్, ఆయాలు గ్రామంలోని పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై తహసీల్దారుకు వినతి



తహసీల్దారు శ్రీనివాసశర్మకు వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

చేబ్రోలు: సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం చేబ్రోలు మండలంలో సభ్యులు తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని, ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్న విశ్రాంత పాత్రికేయులకు పింఛన్ పథకాన్ని మన రాష్ట్రంలో కూడా ప్రారంభించాలని కోరారు. అలాగే హెల్త్ స్కీంలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని, అక్రిడిటేషన్ల గడవు పొడిగించకుండా జర్నలిస్టులందరికీ కొత్త అక్రిటేషన్ కార్డులు వెంటనే ఇవ్వాలని, ఇళ్ల స్థలాలను ఇస్తామన్న హామీని నిలబెట్టుకోవాలన్నారు. అక్రిటేషన్ కమిటీలలో జర్నలిస్టుల యూనియన్స్‌కు ప్రాతినిధ్యం కల్పించాలని తదితర డిమాండ్స్‌తో కూడిన వినతి పత్రంను తహసీల్దారు కే.శ్రీనివాసశర్మకు అందజేశారు. కార్యక్రమంలో జర్నలిస్టు సంఘ సభ్యులు ఆర్.గంగాధర్, సీహెచ్.వీ.సురేష్‌బాబు, ఎస్.నాగరాజు, జి.ప్రసాదరావు, కే రాజశేఖర్, కృష్ణ పాల్గొన్నారు.

18 నుంచి డీటీపీలో ఉచిత శిక్షణ

కొరిటిపాడు(గుంటూరు): యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో వివిధ వృత్తి విద్య కోర్సుల్లో శిక్షణఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ టి.సందీప్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18వ తేదీ నుంచి డీటీపీ, 25వ తేదీ నుంచి ఉమెన్స్ టైలరింగ్, సెప్టెంబర్ ఒకటి నుంచి బ్యూటీ పార్లర్ మెనేజ్‌మెంట్, 8వ తేదీ నుంచి సెల్‌ఫోన్ రిపేర్స్ అండ్ సర్వీసెస్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ, ఓల్డ్ బ్యాంక్ వీధి, కొత్తపేట, 0863-2336912, 9700687696, 8125397953, 9949930155 సంప్రదించాలని కోరారు.

వార్డు సచివాలయ కార్యదర్శికి షోకాజ్ నోటీసులు

నెహ్రూనగర్: నగరంలోని వార్డు సచివాలయ కార్యదర్శులు తప్పనిసరిగా సమయపాలన పాటిస్తూ, కార్యాలయ పని వేళల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. మంగళవారం కమిషనర్ శనక్కాయల ఫ్యాక్టరీ దగ్గరలోని 32, 33, 38, కుగ్లర్ హాస్పిటల్ రోడ్‌లోని 34, గుంటూరు వారితోట లోని 29, 30, 34, 38 వార్డు సచివాలయాలను ఆకస్మిక తనిఖీ చేశారు. తొలుత హాజరు రిజిస్టర్లు తనిఖీ చేసి సచివాలయ కార్యదర్శుల హాజరు సక్రమంగా లేకపోవడం, పని వేళల్లో మూవ్మెంట్ రిజిస్టర్‌లో నోట్ చేయకుండా వెళ్లడం గమనించి, ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయంలో ఎవ్వరూ లేకుండా తాళం వేసిన 34వ వార్డు సచివాలయ కార్యదర్శికి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. ఇక నుంచి వార్డు సచివాలయాలను ప్రతిరోజు ఆకస్మిక తనిఖీలు చేస్తామని, కార్యదర్శులు ప్రజలకు జవాబుదారీతనంతో వ్యవహరించకుంటే చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వ సర్వేలు, ఇతర కార్యక్రమాలు ఉంటే తప్పనిసరిగా మూవ్మెంట్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని, సెలవులు తమ నోడల్ అధికారి, విభాగ అధికారి ద్వారా మంజూరు చేసుకోవాలని కోరారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ప్రత్తిపాడు డివిజన్
90109 57733 (ప్రత్తిపాడు)
90109 62225 (పొన్నూరు)
Office mail : sakshigntadvt@gmail.com